క్లుప్తంగా


గరుడ వాహనంపై వేంకటరమణుడు



గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై విహరించారు. స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక అలంకారం



మదనపల్లె సిటీ : స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి బొప్పాయి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మూలవర్లకు వెన్న అలంకారం చేశారు. స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు

పెద్దతిప్పసముద్రం : ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ప్రభుత్వం ద్వారా రైతు భరోసా కేంద్రాలకు కందులు వచ్చినా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. గతంలో అయితే రైతులకు 60 శాతం సబ్సిడీతో రైతులకు కందులు అందజేసేవారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అయితే కేవలం 30 శాతం సబ్సిడీ మాత్రమే ఇచ్చారు. నాలుగు కిలోల కందుల బ్యాగు రూ.392లు ఉండటంతో రైతులు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే కందుల కన్నా బయట మార్కెట్‌లోనే కందులు కొనుగోలు చేయడం ఉత్తమమని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు వారి సేవలను విస్తృతం చేశారు. ఈ నేపథ్యంలో ట్రస్టు సభ్యుడు రాజారెడ్డి తన తండ్రి మారపరెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా శనివారం కుటుంబ సభ్యులతో కలసి విజన్ ఇండియా అభయాశ్రమంలో వృద్ధులు, వికలాంగులకు అన్నదానం చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ పేర్కొన్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సమష్టిగా కృషి చేయాలని డిపో -1 మేనేజర్ మూరే వెంకటరమణరెడ్డి అన్నారు. ఓఆర్‌లో మదనపల్లె వన్ డిపో రీజనల్ స్థాయిలో మొదటి స్థానం నిలిచినట్లు ఆయన తెలిపారు. శనివారం స్థానిక డిపోలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఓఆర్‌లో 71 శాతం, ఈపీకే 38.49తో రీజినల్ స్థాయిలో రెండో స్థానం నిలిచినట్లు పేర్కొన్నారు. అందరూ కలసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ గీత, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత రక్త వర్గీకరణ



చిన్నారులకు బ్లడ్ గ్రూపింగ్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

మదనపల్లె సిటీ : స్థానిక దేవతానగర్‌లోని చైతన్య సర్వీస్ సొసైటీ చిన్నారులకు శనివారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తవర్గీకరణ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రక్తవర్గీకరణ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్లడ్‌గ్రూపు తెలుసుకోవాలన్నారు. రక్తగ్రూపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, చైతన్య సొసైటీ ఏఓ బాబు, హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలి

ఎంపీడీఓ భానుప్రసాద్



సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

మదనపల్లె : గ్రామస్థాయిలో సామాజిక తనిఖీని పారదర్శకంగా చేయాలని ఎంపీడీఓ భానుప్రకాష్ అన్నారు. శనివారం మదనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో 18వ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ...మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో 2023–24 సంవత్సరంలో చేపట్టిన అన్నిరకాల పనులను సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పరిశీలిస్తుందన్నారు. అందులో భాగస్వామ్యులైన రైతులు, కూలీలను విచారిస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో జరిగిన ప్రతి పనిని ఉపాధిహామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, సామాజిక తనిఖీ బృందంకు సంబంధిత రికార్డులతో సహా చూపించాలన్నారు. 2023–24 సంవత్సరంలో మొత్తం 3,263 పనులకు గాను వేతనాల రూపంలో రూ.4కోట్ల 36లక్షల 28వేల76, సామగ్రి రూపంలో 3కోట్ల79లక్షల18వేల703...మొత్తం కలిపి 8కోట్ల 15లక్షల 46వేల779 రూపాయలు ఖర్చుచేశారన్నారు. ఇందులో అత్యధికంగా హౌసింగ్ లబ్ధిదారులకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేశామన్నారు. వీటితో పాటు పండ్లతోటల సాగు, నీటి సంరక్షణ పనులు, గ్రామస్థాయిలో సచివాలయ భవనాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీసీఆర్‌ఎం మూర్తి, ఏఈ పీఆర్ వెంకటరమణ, ఏపీఓ సుబ్రహ్మణ్యం, డీఆర్‌పీడబ్ల్యూ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దళితులే లక్ష్యంగా కౌంటింగ్ తర్వాత హింస

- టీడీపీ ముసుగులో అసాంఘిక శక్తుల అరాచకం
- దాడులపై సీఎం, డిప్యూటీ సీఎం స్పందించాలి
- వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్



మదనపల్లె : ఎన్నికల కౌంటింగ్ తర్వాత రాష్ట్రంలో చెలరేగిన హింసలో ప్రధానంగా దళితులే టార్గెట్ అయ్యారని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ ముసుగులో కొన్ని అరాచకశక్తులు రంగప్రవేశం చేసి కుల ఉన్మాదంతో దళితులపై దాడులకు పాల్పడుతున్నారని, దళితుల ఆస్తులు, పంటలు ధ్వంసం చేస్తున్నారన్నారు. కొన్నిచోట్ల దళితుల మధ్యే చిచ్చుపెట్టి వాళ్లలో వాళ్లే కొట్టుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. తమ అకృత్యాలతో అరాచకశక్తులు టీడీపీ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వంలో తమపై కొనసాగిన హింస, అరాచకం భరించలేకే దళితులు వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా ఓట్లువేసి, టీడీపీ కూటమికి అధికారం కట్టుబెట్టారని గుర్తుచేశారు. దళితులు, కాపులు గంపగుత్తగా ఓట్లు వేయడం వల్లే టీడీపీ కూటమి ఘనవిజయం సాధించిందన్న విషయం మరచిపోవద్దన్నారు. గత ప్రభుత్వంలో కొనసాగినట్లే, టీడీపీ ప్రభుత్వంలోనూ దళితులపై హింస కొనసాగితే, భవిష్యత్తులో దాని తాలూకు దుష్ప్రభావాన్ని టీడీపీ చవిచూడాల్సి ఉంటుందన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు వెంటనే స్పందించి దళితులపై దాడుల నివారణకు కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో లాగా అరాచకాలు చేయకండి, హుందాగా ప్రవర్తించండని సీఎం, డిప్యూటీ సీఎంలు పదేపదే ఎందుకు చెబుతున్నారో టీడీపీ శ్రేణులు అర్థం చేసుకోవాలన్నారు. దళితులపై దాడులు కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని, త్వరలోనే దళిత నేతలంతా సమావేశమై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి

పీలేరు రూరల్ : మండలంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి అన్ని నీటి ట్యాంకులు శుభ్రం చేసి పైప్‌లైన్ల లీకేజీ గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలన్నారు. దోమలు ప్రబలకుండా మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని ఆదేశించారు. మండలంలో చేపట్టే పనులపై ప్రతి రోజు మండల కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజనాయక్ చెప్పారు.

దాతలు ఆదుకోవాలి

సంబేపల్లె : మండల పరిధిలోని గున్నికుంట్లకు చెందిన శ్రీరాములు కుమారుడు, అరుణ్‌కుమార్ (21) ఈ నెల 15న రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో మృత్యువుతో పోరాడుతున్నాడు. అరుణ్ కుమార్ 15న సంబేపల్లె మండలం, దేవపట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కోమాలో ఉన్న అరుణ్ కుమార్ వైద్య చికిత్స కోసం దాతలు సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం చేయదల్చుకున్న వారు విజయ్ 9010878334, చంద్ర 8886964851 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పౌరసరఫరాల గోదాం తనిఖీ

లక్కిరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదాంను తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జయదేవ్, నాగరాజు సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాల మేరకు గోదాంలో నిత్యవసర సరుకులు చెక్కెర, కందిపప్పు ప్యాకెట్లను తూకాలు వేసి పరిశీలించామని తెలిపారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే చెక్కర, కందిపప్పు నిర్దేశిత పరిమాణం కంటే తక్కువగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం



పుస్తకాలు అందజేస్తున్న వాసవీ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పిఆర్ గుప్తా

మదనపల్లె సిటీ : వాసవీ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వాసవీ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పిఆర్ గుప్తా అన్నారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పాఠశాలకు వాటర్‌ట్యాంక్, దివ్యాంగులకు స్టిక్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాలలు పునః ప్రారంభం పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు,విద్యాసామాగ్రిని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ సెక్రటరీ నరసింహులు, యశశ్వినిగుప్తా, వాసవీ క్లబ్ మదనపల్లె అధ్యక్షులు శ్రీనాథ్, కార్యదర్శి అమరనాథ్, లక్ష్మీదీపక్, వనితా క్లబ్ జ్యోతి, జయశ్రీ, భానురేఖ,జీఆర్‌టీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, హెచ్‌ఎం పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పీలేరు : సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. శనివారం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కావలిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రక్త పరీక్షల ద్వారా సికిల్‌సెల్ అనిమియా సమస్యను గుర్తించవచ్చునని తెలిపారు. ఇది ఒక దీర్ఘకాలిక వ్యాధి అని, లక్షణాలను బట్టి వైద్య సరంక్షణతో సమస్య లేకుండా రోగి జీవన నాణ్యతను మెరుగు పరచుకోవచ్చునని చెప్పారు. ఈ ఆరోగ్య సమస్యతో శరీరములో రక్త కణాల పరిమాణం తగ్గి తీవ్ర రక్తహీనతకు దారితీస్తుందన్నారు. కార్యకరమంలో హెచ్ఈ కొండయ్య, శ్రీనివాసులు, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం భార్గవి, సీహెచ్‌వో చంద్రకళ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో వాల్మీకి రామాయణ పారాయణం



ఒంటిమిట్టలో వాల్మీకి రామాయణ పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట: ఆంధ్రాభద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామాలయం వద్ద శనివారం వాల్మీకి రామాయణ పారాయణ కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు ప్రారంభించారు. దుందుకూరు వెంకటప్ప యజ్ఞనారాయణ సోమయాజీ రామాయణ పారాయణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జూన్ 30వ తేది వరకు పారాయణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వహకులు వెల్లడించారు.

ఘనంగా వార్షికోత్సవం

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయితీ ఓబుల్‌రెడ్డిగారిపల్లిలో వెలసిన అవధూత నారాయణస్వామి 75వ ఆరాధన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకం, మహాగణపతి స్వస్తి పుణ్యావాచనం, మండపారాధన పూజ, రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్కిరెడ్డిపల్లెకు చెందిన శివసాగర్ బృందం కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

వైభవంగా గరుడ సేవ

పెనగలూరు (ఓబులవారిపల్లె): వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి గరుడసేవ అంగరంగ వైభవంగా జరిగింది. ముదిరాజ్ సంఘం వారు ఉభయదాతలుగా గరుడ సేవా కార్యక్రమంలో వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు గరుడ సేవ కార్యక్రమంలో పాల్గొని వేణుగోపాలస్వామి, రుక్మిణీ సత్యభామను దర్శించుకున్నారు. అనంతరం ఊరేగింపు కార్యక్రమం, హరికథా కాలక్షేపం నిర్వహించారు.

ముగిసిన ఆంజనేయస్వామి తిరునాల

సుండుపల్లె: మండల కేంద్రంలోని తిమ్మసముద్రం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి తిరునాల శనివారంతో అంగరంగ వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాలలో రంగురంగుల చాందినీ బండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



పెనగలూరు: గరుడ వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి



సుండుపల్లి: ప్రత్యేక ఆకర్షణగా చాందిని బండి

క్షయ వ్యాధిలేని సమాజం నిర్మిద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : క్షయ వ్యాధిలేని సమాజం కొరకు పెద్దలకు బీసీజీ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య విద్యాధికారి మహమ్మదర్ రఫీ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి అధ్యక్షతన బీసీజీ టీకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి మాట్లాడుతూ బీసీజీ టీకా ప్రాముఖ్యత గురించి వివరించారు. బీసీజీ టీకాల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకొని తమ ఇళ్లలోని కుటుంబ సభ్యులకు తెలియజేసి వైద్యుల సలహాతో బీసీజీ టీకా వేయించుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భూపతి, అమృత, సరోజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలకు త్రిపుల్ ఏ రేటింగ్



త్రిపుల్ ఏ రేటింగ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మిట్స్ కళాశాల యజమాన్యం

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయిలో టాప్ ట్వంటీ (20)కళాశాలగా త్రిపుల్ ఏ రేటింగ్ సాధించిందని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్‌లో జనవరి నుంచి ఏప్రిల్ 2024 మధ్య కాలంలో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 4858 సర్టిఫికెట్ కోర్సులు చేశారన్నారు. ఇందులో 3463 మంది ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ పొందారన్నారు. ఇందుకు కళాశాలకు త్రిపుల్ ఏ రేటింగ్‌తో పాటు టాప్ ట్వంటీ కళాశాలగా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందడం గర్వకారణమన్నారు. చెన్నై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన కార్యక్రమంలో ఈ గుర్తింపు సర్టిఫికెట్‌ను కళాశాల అందుకున్నట్లు తెలిపారు. ఈ ఘనత రావడంపై కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్త నాదేళ్ల హర్షం వ్యక్తం చేశారు.

25న ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలం



ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో వేలానికి సిద్ధంగా ఉన్న వాహనాలు

మదనపల్లె : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోస్టేషన్ (ఎస్ఈబీ) మదనపల్లె పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 25వతేదీ, మంగళవారం స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మంగళవారం ఉదయం 9.30 గంటలకు నక్కలదిన్నెతాండా, పప్పిరెడ్డిగారిపల్లెలోని ఎస్ఈబీ స్టేషన్‌లో వాహనాల బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 డిపాజిట్ మొత్తం చెల్లించి, ఎంట్రీపాస్ లేదా టోకెన్ నంబర్ పొందాలన్నారు. ఇవి కలిగిన వారిని మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అనుమతిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వాహనాలను స్టేషన్ ఆవరణలో పరిశీలించుకోవచ్చన్నారు. 25వతేదీ వేలంలో పాల్గొన్న వారు అదేరోజు పాడుకున్న మొత్తాన్ని 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించి, వాహనాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. చెల్లించాల్సిన మొత్తాన్ని నగదురూపంలోనే చెల్లించాలని, ఈ–పేమెంట్స్ అనుమతించమన్నారు. వేలంలో వాహనాలను అధికధరకు పాడుకున్న వ్యక్తి, వాహన కొనుగోలు ధరను చెల్లించని పక్షంలో వారి డిపాజిట్ పైకం తిరిగి ఇవ్వడం జరగదన్నారు. వేలంలో పాల్గొన్న తరువాతి పోటీదారుడికి వాహనం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే వాహనాలను అధికధరకు వేలంలో పాడుకుని, ఉద్దేశపూర్వకంగా నగదు చెల్లించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ వేలం అన్నమయ్యజిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ షాపింగ్ గదుల వేలం



షాపింగ్ గదులకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె : పట్టణంలో వేర్వేరు ప్రాంతాల్లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఖాళీ షాపులకు సంబంధించి శనివారం కమిషనర్ కే.ప్రమీల చాంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు జే.కే.స్ట్రీట్, ముగ్గురాళ్లవంక, చిత్తూరుబస్టాండ్, బెంగళూరుబస్టాండ్, అబ్దుల్‌కలాం ఆజాద్, సుభాష్‌రోడ్డు, కో–ఆపరేటివ్ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీ రూములకు వేలం నిర్వహించారు. మొత్తం 51 షాపింగ గదులకు వేలం నిర్వహిస్తే, కేవలం 6 షాపులకు మాత్రమే డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనేందుకు ముందుకువచ్చారు. వాటిలో ముగ్గురాళ్లవంక షాపునెం.54ను సి.శ్రీనివాసులు రూ.2,150, అబ్దుల్‌కలాం ఆజాద్ కాంప్లెక్స్ షాపునెం.1ను ఎస్.సాబియా రూ.6,200, ముగ్గురాళ్లవంకలోని షాపునెం.42ను ఆర్.గుబేంద్రరాజు రూ.5,100, షాపునెం.16ను ఎస్.ఫక్రుద్దీన్ రూ.14,600, షాపునెం.18ను ఎస్.దస్తగిరి రూ.14,600, బెంగళూరు బస్టాండ్‌లోని షాపునెం.3ను షేక్‌బావాజాన్ రూ.18వేలకు వేలం హెచ్చుమొత్తానికి పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆర్వో నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రామమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

రామసముద్రం : రామసముద్రం మండలం మినికి బండపై వెలసిన శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 27వ తేదీ గురువారం వరకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 23వ తేదీ అభిషేకం, మహ మంగళహారతి, భక్తులకు తీర్థప్రసాద వినియోగం , రాత్రి అంకురార్పణ, ధ్వజారోహణం, బలిహరణ, సీతారామాంజనేయ స్వామి అవతారంలో ఊరేగింపు , 24 కలిశారాధన, హోమబలిహరణ, మహా మంగళహారతి, వాహనసేవ, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 25న కలిశారాధన హోమం, మహామంగళహారతి, మధ్యాహ్నం ఉట్ల తిరుణాలు, అన్నదానం, 26న ప్రాకారోత్సవం, ధోపోత్సవం, పుష్పపల్లకి మరియు పౌరాణిక నాటకం, 27న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణం, శయనోత్సవంతో ముగుస్తాయన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నందలూరు: 2023–24 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నందలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నగదు పురస్కారం అందజేశారు. అరిగె రాంప్రసాద్‌రెడ్డి తండ్రి దివంగత అరిగె పెద్ద సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకం ఇవ్వడం గతేడాది నుంచి ఇస్తున్నారు. ఈ ఏడాది మండలంలో టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హేమంత్ యాదవ్ 572 మార్కులతో మొదటి స్థానంలో నిలిచినందుకు రూ. 10 వేలు, పాటూరు జిల్లా పపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రూప 567 సాధించి ద్వితీయ స్థానం పొందినందుకు రూ. 6 వేలు, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సఫియా సుల్తానా 560 మార్కులు సాధించి మూడోస్థానం పొందినందుకు రూ. 4 వేలు నగదును సాయి లోకేష్, డాక్టర్ అరిగె రాంప్రసాద్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు రాప్, విద్యార్థులు పాల్గొన్నారు.